క్లుప్తంగా

ఆదిత్యుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న ఉషా, చాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి ఆలయంలో స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకట నరసింహాచార్యులు, మరికొంత మంది అర్చకులు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి పోస్టర్ ఆవిష్కరణ



షష్ఠి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించే షష్ఠి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వచ్చే నెల 6 నుంచి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు పడాల వెంకటరామారెడ్డి, షష్ఠి ఉత్సవాల కమిటీ చైర్మన్ పల్లి వాసు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్రెల త్రిమూర్తులు, కొంకుదురు మాజీ సర్పంచి కొవ్వూరి వేణుగోపాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సీతానగరం: సింగవరం పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. సింగవరం లంకలోని పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో, వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.30,280 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

హరిహర క్షేత్రంలో 29న వన సమారాధన

కడియం: మండలంలోని కడియపులంకలో ఉన్న హరిహర మహా క్షేత్రంలో ప్రతి ఏటా కార్తిక మాసం మాస శివరాత్రి రోజున భారీ అన్నదానం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ నెల 29వ తేదీన వన సమారాధనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది చివరి కార్తిక శుక్రవారం మాస శివరాత్రి కావడంతో భారీఎత్తున భక్తులు హాజరవుతారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లలో భాగంగా కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ.వేంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహిళలకు కొత్త పూల మార్కెట్ వద్ద, పురుషులకు ఆలయ ప్రాంగణంలోనూ అన్నదానం చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం, నర్సరీ రైతులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

దళారుల పంట పండింది

- ఖరీఫ్ ధాన్యం విక్రయాల్లో వారిదే హవా
- అన్నదాతలు ఆశించిన మేరకు దక్కని ధర
- కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పడలేక బయట అమ్ముకుంటున్న వైనం
- రైతన్నలకు తప్పని నష్టం



పొలం నుంచే జరుగుతున్న ధాన్యం విక్రయాలు



యంత్రాలతో కోతలు కోస్తున్న వరి పంట

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు మార్కెట్‌లో ఆయా పంటలకు తగిన ధర లభిస్తేనే తగిన ఫలితం ఉంటుంది. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ధాన్యం దిగుబడులు ఆశించిన మేరకు వస్తున్నా కానీ, వాటికి ధర మాత్రం ఆశించిన మేరకు దక్కడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1,720 గిట్టుబాటు ధర ఇస్తున్నప్పటికీ, ఆ ధర పొందేందుకు ఆరుదల ఉండాలని, 17 శాతంలోపే తేమ ఉండాలంటూ పలు రకాల నిబంధనలు పెట్టడంతో.. ఆ బాధలు పడలేక చాలామంది రైతులు.. దళారులకు పండిన పంటను విక్రయించి, చేతులు దులుపుకొంటున్నారు. ఈ కారణంగా ప్రభుత్వం బస్తాకు పేర్కొన్న రూ. 1720 ధరను దళారులు ఇవ్వడం లేదు. కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లింపులు చేసే విధంగా రూ.1,300 నుంచి రూ.1,500 ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీనితో బస్తాకు ఆయా రైతులకు రూ.200లకు పైబడి నష్టం వాటిల్లుతోంది. పోతే పోయాలయిలే వెంటనే సొమ్ములు వస్తున్నాయనే ఆశతో నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ మండలాలలో చాలామంది రైతులు దళారులు చెప్పిన ధరకు విక్రయాలు సాగిస్తున్నారు.

కొనుగోళ్లు అంతంత మాత్రమే!

ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినాగాని రైతుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. పొలం నుంచి నూర్పు చేసిన ధాన్యాన్ని బస్తాలలోవేసి, తూకం తూయడం, ఆపై వాటిని లారీలలోకి ఎక్కించి, లోడు చేసి సూచించిన మిల్లుకు పంపించడం వంటి పనులతో ఇబ్బందులు పడలేక, దళారులకు పొలం నుంచే నేరుగా విక్రయాలు సాగిస్తున్నారు. అంతేకాక ఆర్‌బీకెల ద్వారా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం విక్రయాలు సాగించిన రైతులకు ఆయా సొమ్ములు బ్యాంకు అకౌంట్‌లలో జమ అయ్యేందుకు ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో దళారులకు విక్రయించడం ద్వారా సొమ్ములను రెండు, మూడు రోజులలోనే ఆయా రైతులు అందుకున్నారు. ఇది కూడా దళారుల పాత్ర పెరగడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రానన్నపటికీ దళారులు చెప్పిన ధరకే ధాన్యం విక్రయాలు జరుగుతున్నాయి. ధాన్యం రకాన్ని బట్టి ధరలు నిర్ణయించి, దళారులు కొనుగోళ్లు చేస్తున్నారు. ఉదాహరణకు బీపీటీ రకం ఆరుదల ధాన్యానికి రూ.1,600, కోసిన వెంటనే కొనుగోలు చేస్తే (తేమ శాతంతో నిమిత్తం లేకుండా) రూ.1,400, స్వర్ణం రకం ఆరుదలకు రూ.1,650, కోసిన వెంటనే అయితే రూ.1,450 ధర చెల్లిస్తున్నారు.

ఇబ్బందులు పడలేకనే..



ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలతో కొంతమేరకు రైతులు ఇబ్బందులు పడినాగాని, ప్రస్తుతం ఎకరాకు 30 నుంచి 35 బస్తాల వరకు మంచి దిగుబడులు వస్తున్నాయి. అయితే పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికే ఇబ్బంది పడవలసి వస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఆర్‌బీకెల ద్వారా ధాన్యాన్ని విక్రయించి, బస్తాకు రూ.1,720 గిట్టుబాటు ధర తీసుకోవాలనే ఆశ ఉన్నాగానీ, ఆయా నిబంధనలతో ఇబ్బందులు పడలేకనే పొలం నుంచే విక్రయాలు సాగిస్తున్నాం. దీనివలన ప్రభుత్వం ఇచ్చే ధరకు దళారులు (వ్యాపారులు) ఇచ్చే ధరకు రూ.100 నుంచి రూ.200 వరకు వ్యత్యాసం వస్తుంది. కానీ సొమ్ములు వెంటనే అందుతున్నాయి.

– ఎస్.త్రిమూర్తులు, రైతు, ఆలమూరు

పొలం వద్దే అమ్మేస్తున్నారు



పండించిన ధాన్యాన్ని బస్తాలలోకి ఎత్తుకునేందుకు సంచులు సమకూర్చుకోవాలి, సంచుల్లోకి ఎత్తిన ధాన్యాన్ని తూకం వేసేందుకు వేబ్రిడ్జికి వెళ్లాలి. లేదు పొలంలోనే తూకం వేయాలంటే అందుకు అవసరమైన జట్టు కూలీలను ఏర్పాటు చేసుకోవాలి, ఇవన్నీ దాటుకుని ఆర్‌బీకెలకు తీసుకువెళ్లేందుకు లారీ లేదా ట్రాక్టరును సమకూర్చుకోవాలి, అక్కడకు వెళ్లిన తరువాత ఆ ధాన్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు 17 శాతం లోపునే తేమ ఉండాలి. ఆ విధంగా అమ్మిన ధాన్యాన్ని సొమ్ములు ఎప్పుడు ఆయారైతుల బ్యాంకు అకౌంట్లలో పడతాయో తెలీదు. వాటి కోసం ఎదురు చూడాలి. ఈ బాధలన్నీ పడలేకనే పండించిన ధాన్యాన్ని నేరుగా పొలం నుంచే విక్రయాలు చేసుకునేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తిని చూపిస్తున్నారు.

– పి.రామకృష్ణ, రైతు, సంపత్‌నగరం

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజానగరం: సంపత్‌నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్స్) డి.శ్రీధర్ వర్మ తెలిపారు. టవర్ లైన్స్ పనులు చేపట్టాల్సి ఉన్నందున సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, కొత్త తుంగపాడు, పాత తుంగపాడు గ్రామాల్లోని అన్ని రకాల విద్యుత్ వినియోగదార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం



ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

రాజానగరం: యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తుందని గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ అన్నారు. కళాశాలలో ఎన్‌సీసీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ ఏఎన్‌ఓ తేజేశ్వరరాజు వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఎన్.లీలావతి, డాక్టర్ బి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వన సమారాధనలు భక్తిభావాలకు ప్రతీకలు



రామవరంలో దామోదర పూజల్లో పాల్గొన్న సూర్యనారాయణరెడ్డి



గంగాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న జక్కంపూడి విజయలక్ష్మి

పెదపూడి: కార్తిక వనసమారాధనలు భక్తిభావాలకు ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ముందుగా ఉసిరిచెట్టు వద్ద దామోదర పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది వైభవంగా కార్తిక వనసమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇవి ఐక్యతకు దోహదం చేస్తాయన్నారు. నియోజకవర్గంలోని అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట మండలాల నుంచి సుమారు 4వేల మంది వనసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వన సమారాధనలు ఐక్యతకు చిహ్నాలు

పెదపూడి: కార్తిక వనసమారాధనలు ఉత్సాహంగా నిర్వహించుకోవాలని రజక చైతన్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ మురమళ్ల వెంకటరమణ అన్నారు. జి.మామిడాడ గ్రామంలో ఆయన అధ్వర్యంలో రజక చైతన్యసంఘం వారు కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మురమళ్ల వెంకటరమణ, వీర వెంకటలక్ష్మి దంపతులు ఉసిరి చెట్టువద్ద గణపతి పూజ, కార్తిక దామోదర పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారంపూడి వెంకటరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్ రెడ్డి, సతి భగవాన్‌రెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ కాకి సత్యనారాయణ, రజక చైతన్య సంఘం నియోజకవర్గం ప్రతినిధులు సీతారాముడు, ఏసు, తదితరులు పాల్గొన్నారు.



రాపాక కొబ్బరి తోటలో బ్రాహ్మణ సంఘం కార్తిక వన సమారాధన

ప్రతి ఇంటా శుభాలు కలగాలి

వైఎస్సార్ సీపీ నేత జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: మెట్ట గంగాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా శుభాలు కలగాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఆదివారం కూనవరం- ముగ్గళ్ల మధ్యనున్న మెట్ట గంగాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరిగిన కార్తిక మాస పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. అనంతరం కార్తిక వన భోజన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నట్టమోలు భాస్కర్, సుంకర నరసింహారావు, మేండ్రు కాపు, పెట్ల నాగు, మేండు పిచ్చయ్య, నల్లమోలు సూకరాజు, అయిల మధు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

సీతానగరం: మండల బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో రాపాక వద్ద కొబ్బరి తోటలో ఆదివారం కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం రమా సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజును ఈ సందర్భంగా సత్కరించారు. మహిళలు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.



జి.మామిడాడలో పూజలు చేస్తున్న వెంకటరమణ దంపతులు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాపాక కొబ్బరి తోటలో కార్తిక వన సమారాధన జరిగింది. తొలుత సత్యనారాయణస్వామి వ్రతం, శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం కుటుంబ సమేతంగా ఆటపాటలతో గడిపారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



కొండయ్య దంపతులను సన్మానిస్తున్న ప్రముఖులు

పెదపూడి: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకిత భావాన్ని అలవరుచుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి గ్రామానికి చెందిన ఐఎల్‌టీడీ ఉద్యోగి కొండయ్య పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 32 ఏళ్లుగా ఐఎల్‌టీడీ కంపెనీలో ఉద్యోగిగా పనిచేసి అందరి ఆదరాభిమానాలను కొండయ్య పొందారన్నారు. అనంతరం కొండయ్య దంపతులకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఎల్‌టీడీ స్టాఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అనపర్తిలో చింతా దొరబాబు దంపతులు నిర్వహించిన కార్తిక వనసమారాధనలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చింతా వెంకటరెడ్డి, తమలంపూడి సత్యనారాయణ రెడ్డి, మేడపాటి సత్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కొంకుదురు జెడ్పీ పాఠశాల 1984-85 బ్యాచ్ విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో సహా హాజరైన పాత మిత్రులంతా ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ సరదాగా గడిపారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు పీవీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఎస్‌వీ సూర్యనారాయణ రెడ్డి, బిక్కవోలు మండలం మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొచ్చిన పాత జ్ఞాపకాలు

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి 1993 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. కార్తికమాసం కావడంతో వనసమారాధన ఏర్పాటు చేసుకుని అంతా ఓచోట కలుసుకున్నారు. తమ కుటుంబ సభ్యులతో హాజరై ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పిల్లలకు, పెద్దలకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులను అందించారు. సహపంక్తి భోజనాలు చేశారు. అంతకుముందు కార్తిక దామోదరుడికి, ఉసిరిచెట్టుకు పూజలు చేశారు.



వనసమారాధనకు హాజరైన రంగంపేట జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా చదరంగం పోటీలు



విజేతలతో అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్

రాజమహేంద్రవరం సిటీ: చదరంగం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు కాల్‌ఫ్యూషన్ చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ తెలిపారు. ఆదివారం అకాడమీలో ఇంటర్నల్ చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 120 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్‌లో నాలుగేళ్ల నుంచి 15 ఏళ్లున్న బాలబాలికలు పాల్గొన్నారన్నారు. క్రీడాకారుల స్థాయిని బట్టి బహుమతులు ఇచ్చినట్టు చెప్పారు.

బ్యాంకు ఖాతాలకు అనుసంధానించాలి

బిక్కవోలు: ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించేందుకు లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ, ఆధార్ లింక్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రభుత్వ పథకాల నగదుతో పాటు ఉపాధి హామీ పథకం నగదు అకౌంట్లకు జమ కావాలన్నా లింక్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. లింక్ చేసుకునేటప్పుడు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోస్టాఫీసులు, బ్యాంకుల సంప్రదించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎక్కడి వారైనా ఓకే!

- ఏపీఎస్ ఆర్టీసీలో వయో వృద్ధులకు 25 శాతం రాయితీ
- దేశంలో ఏ ప్రాంతానికి చెందినా వర్తింపు
- ఇక డిజిటల్ గుర్తింపుతో ఆమోదం
- 60 ఏళ్లు దాటితే అర్హత
- గతంలో రాష్ట్ర వాసులకే అవకాశం

చూపించాల్సిన పత్రాలివే..

- ఆధార్ కార్డు
- సీనియర్ సిటిజన్ ఐడెంటిటీ కార్డు
- ఓటరు గుర్తింపు కార్డు
- పాన్ కార్డు
- రేషన్ కార్డు

వీటిని ప్రత్యక్షంగా లేదా డిజిటల్ విధానంలో కండక్టర్‌కు చూపించవచ్చు.



రాజమహేంద్రవరం సిటీ: దేశంలో ఎక్కడి వారైనా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వయో వృద్ధులకు టికెట్ ధరలో 25 శాతం రాయితీ కల్పిస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ చర్యలు చేపట్టింది. నివాస స్థలంలో సంబంధం లేకుండా ప్రయాణించే వెసులుబాటును సంస్థ కల్పించింది. గతంలో ఆంధ్రప్రదేశ్ వాసులకు మాత్రమే వర్తించే ఈ రాయితీ ఇక నుంచి దేశవ్యాప్తంగా వయో వృద్ధులకు అమలు చేస్తూ ఆదేశాలు వెలువరించింది. వయో వృద్ధులకు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ రాయితీ.. కరోనా సమయంలో తొలగించారు. అనంతరం గత ప్రభుత్వం ఈ రాయితీని పునరుద్ధరిస్తూ చర్యలు చేపట్టింది. తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న 60 ఏళ్లు దాటిన వయో వృద్ధులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా అవకాశం కల్పించింది.

గుర్తింపు చూపాలి

టికెట్ కొనుగోలు సమయంలో వయస్సును నిర్ధారించే రుజువును బస్సు కండక్టర్‌కు చూపించి, రాయితీ పొందే అవకాశం ఉంది. ఇప్పటి వరకూ వయస్సు నిర్ధారిత పత్రాలను స్వయంగా చూపించే పరిస్థితి ఉండేది. నూతనంగా జారీ చేసిన ఆదేశాలలో డిజిటల్ విధానంలో వయస్సు నిర్ధారిత పత్రాలను కండక్టర్‌కు చూపించి రాయితీ పొందే అవకాశం ఉంది. ఈ రాయితీని సద్వినియోగం చేసుకుని వయో వృద్ధులు రిజర్వేషన్ పొందవచ్చు. ఈ రాయితీ పల్లె వెలుగు బస్సులు మొదలుకొని ఏసీ బస్సులు వరకూ అన్ని రకాల బస్సుల్లో వర్తించేలా చర్యలు చేపట్టారు.

ఇబ్బందులతో డిజిటల్ విధానానికి చర్యలు

బస్సు ప్రయాణంలో ఆపరేటింగ్ సిబ్బంది టిక్కెట్లను జారీ చేసే సమయంలో తలెత్తుతున్న సమస్యలతో సీనియర్ సిటిజన్ల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యక్షంగా వయస్సు నిర్ధారిత పత్రాలు లేని సమయంలో ఆపరేటింగ్ సిబ్బంది పూర్తి చార్జీలు చెల్లించాలనే నిబంధనలు పాటించడంతో, ఉన్నతాధికారులు డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. 60 ఏళ్ల నిండిన దేశంలో సీనియర్ సిటిజన్లు రాష్ట్రంతో సంబంధం లేకుండా, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన భౌతిక రూపం, డిజిటల్ రూపంలో ఉన్న ఏదైనా వయస్సు రుజువును చూపడం ద్వారా 25 శాతం రాయితీ పొందవచ్చు.

– షేక్ షబ్నం, డిపో మేనేజర్, రాజమహేంద్రవరం

మంచి ఆలోచన



ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సమయంలో వయో వృద్ధులకు 25 శాతం రాయితీ మంచి నిర్ణయం. వయస్సు నిర్ధారిత పత్రాలు ప్రత్యక్షంగా చూపకపోతే టికెట్ పూర్తి డబ్బులు చెల్లించాల్సి ఉండేది. డిజిటల్ విధానంతో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. గతంలో రాష్ట్రంలో ఉన్న వృద్ధులకు మాత్రమే వర్తించే ఈ రాయితీ, దేశంలో ఏ ప్రాంతం వారికైనా అమలు చేయడం బాగుంది.

– పసుపులేటి లక్ష్మీనారాయణ, ప్రయాణికుడు

పేదలకు ఉపయుక్తం



వయో వృద్ధులకు ఆర్టీసీ బస్సు టికెట్‌లో 25 శాతం రాయితీ కల్పించడం ఆనందదాయకం. ఆర్టీసీ నిర్వహించే పల్లె వెలుగు, డీలక్స్, సూపర్ డీలక్స్, అమరావతి, ఇంద్ర తదితర అన్ని బస్సుల్లో అవకాశం కల్పించడం బాగుంది. ప్రధానంగా రాయితీ పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– కర్రి సత్యవతి, ప్రయాణికురాలు